సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



సంక్షేమంలో నంబర్ వన్

సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలుస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు.

8లో▸



కడ్తాల్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

❖ అభిమానం

ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు అభిమానులు, కార్మిక సంఘాల నేతలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రధాన కూడళ్ల వద్ద గద్దర్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి జోహార్లు అర్పించారు.

– కడ్తాల్



ఇబ్రహీంపట్నంలో ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

❖ ఆందోళన

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు రోడ్కెక్కారు. ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించి నాగార్జునసాగర్ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలివ్వాలని కోరారు.

– ఇబ్రహీంపట్నం



ప్రత్యేక అలంకరణలో సుందరేశ్వరస్వామి

❖ అలంకరణ

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సోమవారం స్వామివారు 'ఫల' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు సరేశ్‌స్వామి.. వివిధ రకాల పండ్లతో సుందరేశ్వరుడిని అందంగా అలంకరించారు.

– మొయినాబాద్

న్యూస్‌రీల్

టీకాల పంపిణీకి 'మిషన్ ఇంద్ర ధనస్సు'



పెద్దమంగళారం సబ్‌సెంటర్‌లో చిన్నారికి టీకా వేస్తున్న జిల్లా వైద్యాధికారి

మొయినాబాద్: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి బి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం పెద్దమంగళారం సబ్ సెంటర్‌లో చిన్నారులకు నెలవారీ టీకాలు వేశారు. సబ్‌సెంటర్‌ను సందర్శించిన ఆయన మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు టీకాలు ఎలా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకూ టీకాలు వేయించని పసి పిల్లలను గుర్తించి ఈ నెల 7నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యాక్సినేషన్ జిల్లా అధికారి స్వర్ణకుమారి, చేవెళ్ల డివిజన్ వైద్యాధికారి దామోదర్, మండల వైద్యాధికారి వాణి, సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

మైసమ్మ సన్నిధిలో 'గువ్వల' పూజలు



బాల్‌రాజును సన్మానిస్తున్న అర్చకులు

కడ్తాల్: మైసిగండిలోని అమ్మవారిని సోమవారం ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువా, పూలమాలతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చక సిబ్బంది, గ్రామ కార్యదర్శి సత్యం ఉన్నారు.

రూ.వంద కోట్ల జెడ్పీ నిధులతో అభివృద్ధి




మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లా పరిషత్ నుంచి దాదాపు రూ.100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలకు స్త్రీ, శిశు సంక్షేమానికి అవసరమైన అంగన్‌వాడీలు, డ్వాక్రా భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించామని తెలిపారు. మన ఊరు– మన బడి పథకం కన్నా ముందు పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామని వెల్లడించారు. జిల్లాకు పరిశ్రమలు, పెట్టుబడులు విరివిగా వస్తున్నాయన్నారు. భూముల ధరలు బాగా పెరిగి రైతులు ధైర్యంగా, సంతోషంగా ఉన్నారని వివరించారు. ఇంది సీఎం కేసీఆర్ పాలనతోనే సాధ్యమైందని కొనియాడారు. మొక్కలు నాటడాన్ని సంప్రదాయంగా మార్చుకుని, భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని కోరారు. జిల్లాను అన్ని రంగాల్లోఆదర్శంగా నిలుపుతామని తెలిపారు.

వలసల గుబులు!

కప్పదాటు నేతలతో.. పార్టీలకు తలపోటు

- ద్వితీయ శ్రేణి కేడర్‌పై ప్రత్యర్థుల నజర్
- భారీ ఆఫర్లు.. పార్టీ ఫిరాయింపులు
- అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి
- తలపట్టుకుంటున్న అధికార, ప్రతిపక్షాలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలను వలసల గుబులు పట్టి పీడిస్తోంది. ప్రధాన అభ్యర్థులు మొదలు.. బూత్‌స్థాయి కేడర్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. నిన్న మొన్నటి వరకు వెన్నంటే ఉన్న లీడర్లు, కార్యకర్తలు.. అకస్మాత్తుగా పార్టీని వీడి మరో పార్టీలో చేరుతుండటాన్ని నియోజకవర్గ ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ కాంట్రాక్టులతో అధికార బీఆర్‌ఎస్ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు గాలం వేస్తుంటే.. అధికార పార్టీపై ద్వితీయ శ్రేణి కేడర్‌లో నెలకొన్న అసంతృప్తి, తెలంగాణ ఉద్యమకారులకు సరైన గుర్తింపు లభించని అసంతృప్తులకు ప్రతిపక్ష పార్టీలు గాలం వేస్తున్నాయి.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో హస్తం పార్టీ నుంచి గులాబీ గూటికి వలసలు ఎక్కువయ్యాయి. ఇటీవల తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన అరుగురు కౌన్సిలర్లు సహా సీనియర్ నేత రొక్కం సత్తిరెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. బండరావిరాల, హయత్‌నగర్, పెద్ద అంబర్ పేట నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కారెక్కారు. మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ టేకుల భాస్కర్‌రెడ్డి సహా 400మంది అనుచరులతో అధికార పార్టీలో చేరారు. హర్షగూడ బీజేపీ మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, మంఖాల్‌కు చెందిన కాంగ్రెస్ నేత వెంకటేశ్ యాదవ్ ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరారు. షాద్‌నగర్ నియోజవకర్గం దేవునిపల్లి సర్పంచ్, రాయకల్ మాజీ సర్పంచ్‌లు నందిగామ పీఏసీఎస్ చైర్మన్ రాజగోపాల్ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు.

◆ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల పరిధిలోని కొత్తపల్లి సర్పంచ్ ఎండీ హబీబుద్దీన్, నక్క ర్తిమేడిపల్లి సర్పంచ్ చిగురింత శ్రీనివాసరెడ్డి, తక్కళ్లపల్లి సర్పంచ్ కంబాలపల్లి సంతోష్ ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం నిర్ధవెల్లి ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. పాపిరెడ్డిగూడ ఇప్పలపల్లి, లేమామిడి సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీశైలంగౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. పాపిరెడ్డిగూడ ఉపసర్పంచ్ సుందరయ్య టీడీపీని వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు..

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి దంపతులు సహా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి, సీనియర్ నేత కొత్త మనోహర్‌రెడ్డిలు ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు అమృతనాయుడు హస్తం పార్టీలో చేరారు. ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ చోటు తన అనుచరులు, మిత్రులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరింది. రాయపోలు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త మంకాల దాసు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. – యాచారం పీఏసీఎస్ మాజీ చైర్మన్, టీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నాయిని సుదర్శన్‌రెడ్డి మాజీ డైరెక్టర్ కట్టెకొమ్ముల నారాయణరెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి బీజేపీకి..

తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇబ్రహీంపట్నం మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు దొండ రమణారెడ్డి తొలుత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత కొద్ది రోజులకే మళ్లీ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శంకర్‌పల్లి మండలం మహారాజ్‌పేట ఎంపీటీసీ తొండమల్లమ్మ (స్వతంత్ర అభ్యర్థి) కుమారుడు రవి ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీ లోకి చేరారు.

యువ ఓటర్లకు గాలం

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో జనవరి 2023 నాటికి 3,037 పోలింగ్ కేంద్రాల పరిధిలో 31,08,851 మంది ఓటర్లు ఉన్నట్లు నిర్ధారించారు. వీరిలో 16,16,455 మంది పురుషులు, మరో 14,91,245 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 368 మంది థర్డ్ జెండర్లు, 182 మంది ఎన్‌ఆర్‌ఐలు, 582 మంది సర్వీసు ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లి, అత్యల్పంగా షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్నట్లు తేలింది. వీరిలో మెజార్టీ ఓటర్లు 40 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే శక్తి ఈ వర్గానికే ఉండటంతో ఆయా పార్టీల అభ్యర్థులు వీరిని ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే పోలీసు కానిస్టేబుల్, ఎస్‌ఐ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారి కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ఆకట్టుకునేందుకు క్రికెట్, కబడ్డీ వంటి క్రీడా పోటీలు ఏర్పాటు చేసి, కిట్లు పంపిణీ చేశారు. తాజాగా ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

రాజదండమే తప్పు చేస్తోంది

- హార్డ్ వేర్ పార్క్ పేరుతో భూములు దోచారు
- ప్రొఫెసర్ కోదండరామ్ మండిపాటు
- బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి



నాదర్‌గుల్‌లో హార్డ్‌వేర్ పార్క్ భూ బాధితుల సమావేశంలో అభివాదం చేస్తున్న కోదండరామ్

బడంగ్‌పేట్: ప్రజలు, ధర్మాన్ని కాపాడాల్సిన రాజదండమే తప్పు చేస్తోందని.. ప్రొఫెసర్ కోదండరామ్ తెలంగాణ ప్రభుత్వాన్ని విమర్శించారు. 'హార్డ్‌వేర్ పార్క్ హఠావో– తెలంగాణ బచావో' పేరుతో సోమవారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపారు. అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ఎక్స్‌టెన్షన్ హార్డ్‌వేర్ పార్కును తొలగించాలని డిమాండ్ చేస్తూ నాదర్‌గుల్ నుంచి ఆదిభట్ల మీదుగా కలెక్టరేట్ వరకు నిర్వహించిన పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం కోదండరామ్ మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వ హయాంలో హార్డ్ వేర్ పార్కు పేరుతో.. నాదర్‌గుల్, ఆదిబట్ల, ఎంఎం కుంట గ్రామాల్లోని భూములు, నివాస స్థలాలు, ప్లాట్లను అక్రమంగా తీసుకుని, భూ దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. అప్పటి నుంచి ఈ రోజు వరకూ ఇక్కడ ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని తెలిపారు. గడిచిన 19 ఏళ్లల్లో ఒక్క భూ యజమానికి కూడా కోర్టు నుంచి నోటీసు అందలేదని స్పష్టం చేశారు. రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. భూములను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం ఏడేళ్లలోపు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించకపోతే, తిరిగి బాధితులకు ఇవ్వాలని సుప్రీం కోర్టు చెబుతోందని గుర్తుచేశారు. ప్రైవేటు వ్యక్తులు, రైతుల నుంచి భూములు లాక్కోవడం ఏమిటని నిలదీశారు. ఆంధ్రా పాలకుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకున్న ఉద్యమ స్ఫూర్తితోనే.. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం నుంచి భూములు కాపాడుకుందామని పిలుపునిచ్చారు. బాధితులకు భూములు తిరిగిచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. అనంతరం హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేఖ పోరాట కమిటీ(జేఏసీ) సభ్యులు, రైతులతో కలిసి పాదయాత్రగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎం.రామేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి దార సత్యం, జేఏసీ కన్వీనర్లు కె.లక్ష్మారెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ఎ.శ్రీరాంరెడ్డి, శివశంకర్ మౌర్యా, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నేతన్నలకు సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన చేనేత కార్మికులు మసున సత్యనారాయణ, పాలాది పురుషోత్తం ఉత్తమ చేనేత కార్మికులుగా ఎంపికై ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నుంచి సత్కారం అందుకున్నారు. మన్నెగూడలో సోమవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవంలో వీరికి.. కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డు, రూ.25 వేల నగదు అందించారు. చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, ఆమనగల్లు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ వారిని అభినందించారు.





కేటీఆర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న నేతన్నలు

59 జీఓ దరఖాస్తులు వేగిరం

సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా వ్యాప్తంగా జీఓ నంబర్ 59 కింద వచ్చిన పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన చేసి, వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ హరీశ్ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇందుకు సంబంధించిన అంశాలను సీఎస్‌కు వివరించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ ఫీజులను గడువులోపు చెల్లించాలని, ఇందుకు నిరాకరించిన వారి నిర్మాణాలు కూల్చివేసేందుకు సైతం వెనకాడొద్దని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. 125 గజాల కన్నా తక్కువ ఉన్న స్థలాలను ఉచితంగా, అంతకంటే ఎక్కువవంగా ఉంటే స్టాంప్ డ్యూటీ మేరకు వసూలు చేయాలని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద జిల్లాలోని తహసీల్దార్, మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాల్లో ఆగస్టు 10వ తేదీ వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. 20 నాటికి క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి, 25 నాటికి గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. దళితబంధు కింద ప్రతీ నియోజకవర్గానికి రెండో విడత కింద 1,100 మంది లబ్ధిదారులకు పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

విన్నపాలు వినవలె..




ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు దారులు

- ప్రజావాణికి పోటెత్తిన బాధితులు
- ధరణి, 58, 59 జీఓ అభ్యర్థనలే అధికం
- పనులు కావడం లేదని ఫిర్యాదుదారుల ఆవేదన

ఇబ్రహీంపట్నం రూరల్: 'ప్రజావాణి'కి బాధితులు పోటెత్తారు. సోమవారం అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 248 మంది ఫిర్యాదులు, అభ్యర్థనలు అందజేశారు. గతవారం సైతం 343 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ధరణి సమస్యలతో పాటు 58, 59 జీఓలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది. అర్జీలు అందజేసి నెలలు గడుస్తున్నా పరిష్కారం దొరకకపోవడంతో ప్రజలు మళ్లీమళ్లీ వచ్చి దరఖాస్తు చేస్తున్నారు.

ఆరు నెలలుగా తిరుగుతున్నా



నా కుమారుడి పేరున రెండెకరాల భూమి ఉంది. 2018లో కొత్త పాసుపుస్తకం ఇచ్చారు. అందులో నా కుమారుడి పేరు నేనావత్ రవీందర్‌కు బదులుగా రవి అని పడింది. మా కొడుకు ఫొటో స్థానంలో గుర్తు తెలియని మహిళ ఫొటో ఉంది. ఆరు నెలలుగా తిరుగుతున్నా పనికావడం లేదు.

– బిచ్యానాయక్, కడ్తాల్

సక్సేషన్ కాలేదు



మాది మంచాల మండలం బొడకొండ గ్రామం. మా నాన్నమ్మ పేరు మీద సర్వే నంబరు 79లో 1.38 ఎకరాల భూమి ఉంది. మా నాన్నమ్మ, నాన్న, అమ్మ అందరూ చనిపోయారు. నా పేరున సక్సేషన్ పెట్టుకుని మూడు నెలలుగా తిరుగుతున్నా. అధికారులు స్పందించడం లేదు.

– కొర్ర గణేశ్, బోడకొండ

బోరు మోటారుకు దరఖాస్తు చేశా



మాది ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్. ఎస్సీ కార్పొరేషన్ కింద బోరు మోటారు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఫిబ్రవరి మూడో వారంలో ప్రజావాణికి దరఖాస్తు అందజేశా. ఫీల్డ్ విజిట్ చేసి రిపోర్ట్ ఇస్తే సరిపోతుంది. కానీ జియాలజీ విభాగం వారు స్పందించడం లేదు.

– మైసయ్య, తులేకలాన్

పింఛన్ రావడం లేదు



నా భర్తకు 60 సంవత్సరాలు దాటాయి. పెన్షన్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసుకున్నాం. ఆసరా కార్డు కూడా వచ్చింది. కానీ డబ్బులు రావడం లేదు. సరూర్‌నగర్ నుంచి వచ్చి తిరిగిపోతున్నాం. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– మేడి యాదమ్మ, సరూర్‌నగర్

సంక్షేమంలో మనమే నంబర్ వన్

కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



తలకొండపల్లి: బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తలకొండపల్లి: సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో తన శక్తి మేరకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. సోమవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో, సంఘాయిపల్లితండా, చెన్నారం గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సాలు చేశారు. చుక్కాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు, సంఘాయిల్లి గేట్ వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చుక్కాపూర్–ఖానాపూర్ వరకు నిరిŕ్మించిన బీటీరోడును ప్రారంభించారు. అనంతరం చుక్కాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం చెన్నారం గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు, బీటీరోడ్డు నిర్మాణ పనులు, మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రైతురుణ మాఫీ చేస్తున్నందున సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి మొక్కులు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే 24 గంటల ఉచిత కరెంట్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. 1.50కోట్ల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కిష్టమ్మ, స్వప్న, భాస్కర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు వందన, సరిత, గణేశ్‌గుప్తా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి, ఆంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ పట్టాభిరామశర్మ, కృష్ణమూర్తి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు రమేశ్‌నాయక్, శేఖర్, భాస్కర్‌రెడ్డి, గణేశ్, మల్యానాయక్, చంద్రయ్య, రాజేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో కడ్తాల్‌కు మహర్దశ

కడ్తాల్: హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న కడ్తాల్ పట్టణం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పీఏస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బటర్‌ప్లై సిటీ సంస్థ అందించిన సీఎస్ఆర్ ఫండ్ రూ.1.50 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఎంపీడీఓ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఫార్మాసిటీ, ఫార్మా వర్సిటీలు ఏర్పాటు చేయనుండడంతో ఈ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. మెట్రో రైలు మార్గాన్ని కడ్తాల్ మీదుగా ఆమనగల్లు వరకు పొడగించాలని సీఎం కేసీఆర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించి, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఫార్చ్యూన్ బటర్ ఫ్లై సిటీ ఈడీ రమేశ్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, వెంకటేశ్, ఎంపీడీఓ రామకృష్ణ, డీటీ వినోద్‌కుమార్, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్, రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ తదితరులు ఉన్నారు.

రూ.50 లక్షలతో బంజారా భవన్



మంత్రి సబితారెడ్డిని కలిసిన గిరిజనులు

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపాలిటీకి చెందిన గిరిజనులు సోమవారం నగరంలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బంజారుల వినతి మేరకు మున్సిపల్ కేంద్రంలో రూ.50 లక్షల నిధులతో బంజారా భవనం నిర్మిస్తామన్ని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవినాయక్, శ్రీనివాస్, సురేశ్, యాదగిరి, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, శ్యామేల్ రాజు, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్ అండ్ బీ శాఖల డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్



మాట్లాడుతున్న సాధన రష్మి పెరుమాల్

శంకర్‌పల్లి: సైబర్ నేరాలపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని మోకిల పీఎస్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటారని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫోన్‌కు వచ్చిన అపరిచిత లింక్‌లను ఓపెన్ చేయొద్దని చెప్పారు. ఓటీపీలను అనుమానితులకు చెప్పొద్దన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. స్కూల్ బస్ నడిపే డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరియన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, మోకిల సీఐ నరేశ్, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి, డీఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంట్లో కారం చల్లి పుస్తెలతాడు చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కేశంపేట: మహిళ కంట్లో కారం చల్లి గుర్తు తెలియని దుండగుడు బంగారు పుస్తెలతాడును లాక్కెల్లాడు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల శివారులోని తులవానిగడ్డలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన జువ్వ శ్రీలత భర్త శ్రీనివాసులుతో కలిసి పొలానికి వెళ్లారు. శ్రీలత వ్యసాయపనుల్లో ఉండగా భర్త కొద్దిదూరంలో ఆవును మేపుతున్నాడు. సాయంత్రం ఎక్లాస్‌ఖాన్‌పేట నుంచి కొత్తపేట వైపునకు బైక్‌పై ప్రయాణిస్తున్న దుండగుడు ఆమె వద్దకు వచ్చి సెల్‌ఫోన్‌లో ఓ వ్యక్తిని చూపుతూ.. తనను గుర్తుపడతావా అంటూ వెంట తెచ్చుకున్న కారం పొడి మహిళ కంట్లో చల్లాడు. మహిళను వంచి మెడలోంచి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు వచ్చిన మార్గంలోనే తిరిగివెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, షాద్‌నగర్ రూరల్ సీఐ లక్ష్మీరెడ్డి, ఎస్ఐ వరప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాంధీజీ విగ్రహాన్ని ఢీకొట్టిన టిప్పర్

తెల్లవారుజామున పెద్ద శబ్దం రావడంతో ఆందోళన చెందిన గ్రామస్తులు



అమ్డాపూర్ చౌరస్తాలో టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో ధ్వంసమైన గాంధీజీ విగ్రహం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్‌లో ఓ టిప్పర్ లారీ గాంధీజీ విగ్రహాన్ని ఢీకొట్టింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో పెద్దశబ్ధం వినిపించింది. దీంతో ఆందోళన చెందిన గ్రామస్తులు లేచి చూడగా గ్రామంలోని చౌరస్తాలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో దిమ్మె, విగ్రహం ధ్వంసమయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. నిత్యం అప్పా జంక్షన్ నుంచి జేబీఐటీ అమ్డాపూర్ మీదుగా శంషాబాద్ మండలం మల్కారం వైపు రాత్రిళ్లు టిప్పర్ లారీలు భారీ వెళ్తున్నాయని.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. విగ్రహం ఏర్పాటు చేయాలని లారీ యజమానికి సూచించారు. ఇందుకు ఆయన ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

బెల్టుతో ఉరేసుకుని కార్మికుడి బలవన్మరణం



కేదార్ బిషి మృతదేహం

చేవెళ్ల: ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే కార్మికుడు బెల్ట్‌తో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పవన్ రూటో ప్రింట్ ఇండస్ట్రీస్‌లో రెండేళ్లుగా ఒడిస్సాకు చెందిన ఐదుగురు కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో కేదార్ బిషి(22)అనే కార్మికుడు ఆరు నెలల కిత్రం పనికి వచ్చాడు. ఆదివారం రాత్రి డ్యూటీకి వెళ్లకుండా మద్యం సేవించి గదిలోనే ఉన్నాడు. సోమవారం ఉదయం 9గంటలకు వచ్చిన తోటి కార్మికులు గదిలో కేదార్ బిషి లేకపోవటంతో చుట్టుపక్కల వెతికారు. అప్పటికే స్థానికులు మండలకేంద్రంలోని సాయి వైన్స్ సమీపంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుచెప్పటంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడు తమతోపాటు పనిచేసే కార్మికుడేనని గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తరుచూ ఫోన్ మాట్లాడేవాడని.. ఒంటరిగా ఉండేవాడని తోటి కార్మికులు చెప్పారు. కంపెనీ మేనేజర్ ఆకుల శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లొకేషన్ షేర్ చేసి చెరువులో దూకిన యువకుడి మృతి



వాసు మృతదేహం

ఇబ్రహీంపట్నం: లొకేషన్ షేర్ చేసి ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ, ఎస్ఐ మారయ్య తెలిపిన ప్రకారం.. నగర శివారులోని హస్తినాపురం డివిజన్‌కు చెందిన నేనావత్ వాసు(20) డిప్లొమా చదివాడు. ఉన్నత చదువులకు ఆసక్తిలేక.. ఎవరికీ చెప్పుకోలేక మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం రాత్రి 9.30గంటల ప్రాంతంలో స్నేహితుడి వద్దకు వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయలుదేరాడు. అదేరోజు రాత్రి ఆత్మహత్య చేసుకుంటున్నానని స్నేహితుడు మహేశ్‌కు వాట్సప్‌లో లొకేషన్ షేర్ చేశాడు. వెంటనే మహేశ్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఇబ్రహీంపట్నం చిన్న చెరువు పరిసరాల్లో వెతికారు. చీకటి పడడంతో సోమవారం ఉదయం గాలింపు చేపట్టగా అతని చెప్పు ఒకటి కనబడింది. వెంటనే చెరువులో గాలించగా వాసు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం

తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జుబేర్



మున్సిపల్ చైర్మన్ నరేందర్‌కు జెండా అందజేస్తున్న జుబేర్

షాద్‌నగర్‌రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా అన్ని తపాలాశాఖ కార్యాలయాలలో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.జుబేర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని తపాలాశాఖ కార్యాలయంలో ఈ విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ.. 20 నుంచి 30 అంగుళాల జాతీయ జెండాను రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 12 వరకు ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేపడుతున్నామన్నారు. ఎక్కువ మొత్తంలో అవసరం ఉన్న వారు తపాలాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సబ్ పోస్టు మాస్టర్ విజయ్‌కుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

అదనపు కలెక్టర్‌కు దండుమైలారం గ్రామస్తుల ఫిర్యాదు



అదనపు కలెక్టర్ భూపతిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న దండుమైలారం గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: డివిజన్ పరిధిలోని దండుమైలారంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు అనసూయ, అరుణ మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 90లో ఉన్న 10.37ఎకరాల భూమిలో పల్లె ప్రకృతి వనం, గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశామన్నారు. కొందరు అక్రమార్కులు ఈ భూమిని ఆక్రమించేందుకు కడీలు పాతినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. కబ్జాదారుల నుంచి ప్రభుత్వభూమిని కాపాడాలని కోరారు.

బిల్లులు తేడా .. ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు

శంషాబాద్: గగన్‌పహాడ్‌లోని ఓ మాల్‌లో స్థానికంగా ఉండే కిరణ్ అనే వ్యక్తి వస్తువులు కొనుగోలు చేశాడు. ఇంటి వద్దకు వెళ్లాక బిల్లు చెక్ చేస్తే వందల రూపాయలు తేడా రావడంతో మాల్ వద్దకు వెళ్లి ఆందోళన చేశాడు. దీంతో నిర్వాహకులు బిల్లు వేసే వ్యక్తి తప్పిదంగా సర్దిచెప్పారు. తదనంతరం మరోసారి బిల్లు వేసే సందర్భంలో కూడా తప్పుగా రావడంతో బాధితుడు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడి చేరుకుని మెట్రో నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.సాంకేతిక పొరపాటు వల్ల బిల్లులు తేడా వచ్చాయని నిర్వాహకులు వెల్లడించారు. దీనిపై దర్యాప్తు చేయాలని బాధితుడు పోలీసులను కోరాడు.

పశువుల అనారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప



పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యులు

నందిగామ: పశువులు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి అంజిలప్ప రైతులకు సూచించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ విష్ణు ఆధ్వర్యంలో శ్రీనివాసులగూడలో రాష్ట్ర హోం మంత్రి డెయిరీ ఫాంలో పశువులకు సోమవారం గాలికుంటు నివారణ టీకా వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అంజిలప్ప హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజిలప్ప మాట్లాడుతూ.. గాలికుంటు నివారణ టీకా పశువులకు తప్పక వేయించాలన్నారు. పశువులు ఏ మాత్రం అనారోగ్యాలకు గురైనా వెంటనే స్థానిక పశు వైద్యులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, మహ్మద్ అజాం అలీ, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.